ఇంకా చాలా వివరంగా చెప్పాడు రాజేంద్ర.

మతిపోయింది చౌదరికి. "తన వారసుడు బుర్రలో ఇలాంటి అనూహ్యమైన ఓ పథకం రూపు దిద్దుకోవడం చౌదరిని ఎంత ఉత్తేజపరిచిందీ అంటే అమాంతం కొడుకుని కావలించుకున్నాడు. "గర్వపడుతున్నాన్రా. . .ట్రిగ్గర్ నొక్కకుండా బులెట్‌లా దూసుకుపోయి కృషి పథకంపై చావుదెబ్బ తీయగలిగే నీ ఆలోచన్ని మనసారా అభినందిస్తున్నాను"

అంతే-

అమర ప్రేమికుడిలా నటించి ఓ అమ్మాయి జీవితంతో ఆడుకున్న రాజేంద్ర పోలీసుల ఊహకి సైతం అందని ఓ హత్యకి పథకం వేసాడు.

0 0 0

అగ్ని నాలుకతో అసుర సంధ్యని స్పృశిస్తూ సూర్యుడు అస్తమిస్తున్న సమయాన..

ఎవరో తరుముతున్నట్టుగా కృషి ఇంటికి వచ్చాడు విశ్శు.

అదే సమయానికి జీవితకూడా కృషితో బాటు అక్కడే వుంది.

"మీతో మాట్లాడాలి కృషి" అన్నాడు విశ్శు ఉద్వేగాన్ని అదిమిపెడుతూ. . .

విశ్శు వెంట మరో గదిలోకి నడిచి అంది "చెప్పండి"

"చౌదరి యీ పెళ్ళికి అంగీకరించడం లేదు. కాని రాజేంద్ర సుముఖంగా వున్నాడు."

"అలా అని మీకు చెప్పాడా"

"యస్. . . కేవలం తండ్రికి భయపడి జీవితని మోసం చేయటానికి సిద్ధపడ్డట్టు నా దగ్గర ఒప్పుకున్నాడు. కాని జీవిత ఆత్మహత్యా ప్రయత్నం తెలిసాక బాగా రియాక్టయ్యాడు. . ."

"ఇప్పుడు తండ్రినెదిరించి ఆ పెళ్ళి చేసుకుంటానంటున్నాడా"

"అవును. . . జీవితతో బాటు కొన్ని రోజులపాటు ఎక్కడికయినా వెళ్ళిపోతానంటున్నాడు. ఆ తర్వాత పెళ్ళి చేసుకుని సరాసరి ఇంటికి తీసుకువస్తానంటున్నాడు. ఉన్నది ఒక్కకొడుకే కాబట్టి ముందు కాదన్నా తర్వాత దారికి వస్తాడన్నది రాజేంద్ర నమ్మకం. . ."

వెంటనే జవాబు చెప్పలేకపోయింది కృషి.

"తప్పదు కృషి. . . .మన పందెం మాట అటుంచితే జీవిత జీవితం చక్కబడాలి అంటే యిలాంటిదేదో జరగాలి పైగా రాజేంద్ర తనంతట తానుగా రియాక్టయి యిలాంటి ప్రపోజల్‌కి సిద్ధపడినప్పుడు నువ్వు సహకరించాలి"

"అంటే"

"రాజేంద్రతోబాటు వెళ్ళటానికి జీవితని ఒప్పించాలి"

చాలా సేపు నిశ్శబ్దంగా వుండిపోయిన కృషి "రాజేంద్ర సిన్సియారిటీ మీద మీకంత నమ్మకం వుందా" అంది నిశితంగా చూస్తూ. . .

"రాజేంద్రమీద కాకపోయినా ప్రేమన్న పదం మీద నాకు నమ్మకం వుంది."

తర్వాత జీవిత గదిలోకి వెళ్ళి ఏం చెప్పిందో మరో అయిదు నిముషాలలో జీవిత బయటికి నడిచింది.

బయట కారులో వెయిట్ చేస్తున్న రాజేంద్రని చూస్తూ కంట తడిపెట్టుకున్న జీవిత ఎందుకో దిగులుగా వెనక్కి మరలింది.

"నేను నీకు అన్నలాంటివాడ్ని" నచ్చచెబుతున్నట్టుగా అన్నాడు విశ్వ. . . "వెళ్ళు"

వెళ్ళిపోయారిద్దరూ. . . .

ఆ క్షణంలో తన గురించి ఏమనుకుంటున్నదీ ఆలోచించలేదు విశ్వ . . . గెలుపులాంటి అనుభూతికన్నా ఓ ప్రేమకథని గెలిపించిన అనంత సంతృప్తితో విశ్వ వెనక్కి మరలబోయేటంతలో హాల్లో ఫోన్ రింగయింది.

చౌదరి ఫోన్ చేసాడు.

"నీ ప్రపోజల్‌కి అంగీకరిస్తున్నాను విశ్వ. జీవితని నా యింటి కోడలుగా చేసుకోవాలనుకుంటున్నాను"

విస్మయంగా నిలబడిపోయాడు విశ్వ.

సరిగ్గా అదే సమయానికి నగరంలోని ఓ ఖరీదయిన హోటలు గదిలో అడుగుపెట్టారు రాజేంద్ర జీవితలిద్దరు.

అప్పుడు సమయం రాత్రి ఏడు గంటలు. . .

"ఎందుకా కన్నీళ్ళు"

తలవంచుకుని నిలబడ్డ జీవిత కళ్ళు తుడిచాడు రాజేంద్ర. ఆ క్షణంలో అతడు తప్ప ఆమెను ఓదార్చగల వ్యక్తి శక్తి మరొకటి లేదన్నంత నమ్మకంతో రాజేంద్ర గుండెలపై వాలి బావురుమంది.

ఒక నమ్మకపు పునాదిపై నిలబడ్డ ఏ ఆడపిల్లయినా చాలా సులభంగా బేలన్స్ తప్పే అవకాశముందనే సత్యం తెలిసినవాడిలా బెడ్‌పైకి లాక్కున్నాడు.

ఆమె ప్రతిఘటించలేదు.

ఆ శక్తి ఎప్పుడో కోల్పోయింది. మరోసారికి లొంగనిది మొదటి సారి జాగ్రత్త పడినప్పుడే అన్న నిజం తెలీని జీవిత ఈ క్షణాలే యిక శాశ్వతమన్నంత ఆర్తిగా అతడ్ని చుట్టేసింది.

పది నిముషాల పాటు పరిసరాల్ని మరిచిపోయింది కేవలం జీవిత మాత్రమే. . . మరో పది నిముషాల్లో జరిగే అనర్థం గురించి ఆమెకు తెలీదు. . .

"నాకు భయంగా వుంది" ఈ మాట అన్నది జీవితకాదు రాజేంద్ర "నీకు తెలీదు మాడాడీ మనస్తత్వం. . .ఒకవేళ మనం మొండిగా పెళ్ళిచేసుకున్నా నిన్ను నాతో కలిసి బ్రతకనివ్వరు"

కంపించిపోయింది జీవిత. కొన్ని క్షణాల క్రితం దాకా వున్న ధైర్యం సడలిపోయింది అంతలోనే 'నాకు అన్యాయం చేయకండి"

తీసుకొచ్చింది నీకు అన్యాయం చేయాలనికాదు. . . మనిద్దరికీ ఒకేసారి న్యాయం జరగాలనే. చెప్పు. . . ఒకవేళ రేపు మన పెళ్ళయ్యాక డాడీ నన్ను నీకు దూరం చేయాలని ప్రయత్నిస్తే. . ."

"ఆత్మహత్య చేసుకుంటాను" టక్కున అంది అదొక్కటే తనకు తెలిసిన మార్గమన్నట్టుగా.

ఒక మధ్య తరగతి ఆడపిల్ల బలహీనత గురించి బాగా తెలిసిన రాజేంద్ర "అలా అయితే నువ్వు లేకుండా నేనెలా బ్రతకగలనని- " అన్నాడు తెచ్చి పెట్టుకున్న ఉద్వేగంతో.

"నన్నెందుకు తీసుకొచ్చినట్టు'

కొన్ని నిముషాల క్రితం శరశయ్యపై అతడి క్రింద నలిగిన జీవిత అశ్రుశిక్త నయనాలతో నిలదీసినట్టుగా అడిగింది.

"మాట్లాడండి" వణికిపోతూ అతడ్ని పెనవేసుకుపోయింది. "ఇప్పుడు నన్నేం చేయాలనుకుంటున్నారు."

"నిన్ను నేనేమీ చేయదలుచుకోలేదు జీవితా. నా చివరి క్షణాల్ని నీముందే గడపాలని ఇలా తీసుకొచ్చాను. . ." జేబులోనుంచి ఓ ప్యాకెట్ తీసాడు.

"ఏమిటది"

"నిద్ర మాత్రలు. . . నీ ఒడిలో శాశ్వతంగా నిద్రపోవాలని నేను తెచ్చుకున్న స్లీపింగ్ టేబ్లెట్స్."

"వద్దు" దు:ఖోద్విగ్నంగా వారించబోయింది.

"నన్ను ఆపకు జీవితా. . .ప్రేమించిన ఆడపిల్లకోసం ప్రాణాలు వదిలిన పిరికి ప్రేమికుడిగా నీ కళ్ళముందే రాలిపోనియ్. . . " ఆయాస పడిపోతూ ఆవేశాన్ని ప్రకటించాడు.

"ప్లీజ్"

"జీవితా. . .మరో జన్మంటూ వుంటే ఓ మంచి తండ్రికి కొడుకుగా పుడతాను. నీ ప్రేమను గెలుచుకుంటాను."

సుమారు వంద నిద్రమాత్రలతో చేసిన పౌడర్ని గ్లాసులోని నీళ్లలో కలిపాడు.

"మీరు లేకుండా నేనెలా బ్రతకగలననుకుంటున్నారు."

"వద్దు జీవితా- "

"మీతో బాటు నేను కూడా- "

జీవిత గభాలున గ్లాసు అందుకోబోతుంటే "ఆగు" అన్నాడు ఆవేశంగా. . . అప్పటికే రాసిన ఓ కాగితాన్ని ఆమె ముందుంచి "నాతో పాటు నువ్వూ చావాలి అనుకుంటే ఈ క్రింద నువ్వూ సంతకం చేయ్."

జీవిత ఆలోచించలేదు "బ్రతుకులో సాధించని ప్రేమ మరణంతో గెలుచుకోవాలని వెళ్ళిపోతున్న మా చావుకి ఎవరూ బాధ్యులు కారు" అని రాసివున్న కాగితంపై ఇద్దరూ సంతకం చేసారు.

తాగబోయాడు

"ముందు నేను" అంటూ జీవిత గ్లాసుని అందుకుని గడగడా తాగేస్తుంటే వారించలేదు రాజేంద్ర. మూడు వంతులభాగం జీవిత తాగేక ఆమె చేతి నుంచి గ్లాసులాక్కుని తనూ తాగేడు.

అప్పటికే జీవిత గొంతు పిడచ కట్టుకుపోతున్నట్టు ఆర్తితో పెనుగులాడుతూంది.

కొద్దిపాటి మగతతో ఆమెను గమనిస్తున్న రాజేంద్ర పెదవులపై గర్వంగా నవ్వు మెరిసింది.

కాలిపోతున్న ప్రేమలిప్తల్లో ఆఖరి పోరాటంలో అంగలార్చుకుపోతున్న జీవితని చూస్తూ స్వర్గ స్మృతుల్లో తలదాచుకుని అమర ప్రేమికుల్లా కడతేరిపోదామని అంతసేపూ చెప్పిన రాజేంద్ర ప్రపంచ ప్రేమ చరిత్రల పుటల్ని తినేసే చెదపురుగులా నవ్వుతున్నాడు ఇంకా. . .

జీవితకిదేమిటో అర్థం కావడం లేదు - ఏదో అనిపించినా సరిదిద్దుకునే అవకాశం లేదు.

ఆ క్షణంలో సైతం ప్రియుడి పరిష్వంగాన్నే ఆమె కోరుకుని వుంటే ఆ తప్పు జీవితది కాదు. గొడ్డళ్ళతో గుండెల్ని వ్రయ్యలు చేసినా గోళ్ళతో గుండె పొరల్ని చీల్చినా సృష్టికి లయానికి నడుమ మిగిలే అస్థిత్వం పేరే ప్రేమని ఇంకా నమ్మే వేల కోట్ల ముగ్ధలకి ప్రతినిధిగా ఆమె అలాగే రాజేంద్ర గుండెలపై తలానించింది.

అదిగో. . .సరిగ్గా అప్పుడు గదిలో ప్రవేశించారు చౌదరి ముందే ఏర్పాటు చేసిన పోలీసులు చౌదరితో బాటు. . .

ఆ తర్వాత ఇద్దర్నీ హాస్పటల్‌కి తరలించారు.

జీవిత ప్రాణం పోయిందని డాక్టర్లు వెంటనే తేల్చేసినా రాజేంద్ర ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నించారు.

"రాజేంద్రని రక్షించగలిగాం."

ఓ డాక్టరు చెప్పాడు థియేటరులో నుండి బయటకి వస్తూ.

ఒక్క అంగలో రాజేంద్రని సమీపించిన చౌదరి అలవాటులేని దు:ఖాన్ని అభినయిస్తూ "ఎందుకు ప్రాణాలు తీసుకోవాలనుకున్నారు. నేను కాదన్నంత మాత్రాన ఇలాంటి దారుణానికి ఎందుకు పూనుకున్నారు. ధైర్యంగా ఎదిరించి బ్రతకాల్సిన మీరు... అయ్యో." రాజేంద్ర చేతులు పట్టుకుని కుదిపేస్తుంటే పోలీసు అధికారులు అతడ్ని ఓదార్చే ప్రయత్నం చేస్తున్నారు. . .

అప్పుడు గదిలోకి ప్రవేశించింది కృషి విశ్వతో బాటు. . .

ఓ మూల జీవిత శవం. . .ఎవరూ పట్టించుకోని అనాధ ప్రేతంలా కనిపిస్తుంటే స్తబ్ధురాలైపోయింది.

శబ్ద రహిత భాషలా కళ్ళలో నిలిచిన బాష్పాలు మనసును కలవర పరుస్తుంటే నెమ్మదిగా శవం దగ్గరికి నడచింది కృషి.

నిన్నటి ఆత్మహత్యా ప్రయత్నంలోని భయం లేదిప్పుడు జీవిత నేత్రాలలో..... ఇంకా చావని ఏ ఆశల నక్షత్రాలనో బ్రతుకు తోరణాలుగా పేర్చుకున్న పర్ణశాలలా వుంది.

ఎందుకు తను నిన్న కాపాడింది - ఈ రోజెందుకు తను నచ్చచెప్పి మరీ పంపింది.

సమీపంలోని చౌదరి అభినయం ఏ ఆలోచనలకి [illegible] కృషిని కదిలించిందో

నెమ్మదిగా నడిచింది అక్కడ నిలబడ్డ పోలీసాఫీసరు దగ్గరికి.

చివర రాసిన ఉత్తరాన్ని అక్కడ దొరికిన ఆధారాలని అతడు వివరిస్తుంటే నిశ్శబ్దంగా వింది.

చీకటి ఆవరణలో కారు దగ్గరికి నడుస్తుంటే వచ్చాడు విశ్వ "సారీ" తలవంచుకున్నాడు "ఇలా జరుగుతుందనుకోలేదు"

"కాని నేను అనుకున్నాను మిస్టర్ విశ్వ . . . అందుకే నీ మిత్రుడు చౌదరి కొడుకు సిన్సియారిటీ గురించి నేను ప్రశ్నించింది."

అప్రతిభుడై అతడు నిలబడి వుండగానే వెళ్ళిపోయింది కృషి.

0 0 0

రాత్రి పదకొండు గంటల సమయం. . .

అసహనంగా తన గదిలో పచార్లు చేస్తూ వుండిపోయింది ఆమె. జీవిత ఆత్మహత్య చేసుకోలేదు. తెలివిగా హత్య చేయబడింది. ఎలాగో ఆమెకీ తెలీదు. కాని అది ఖచ్చితంగా హత్యే అనిపిస్తుంది.

కృషి మనసు వికలమైపోయింది. ఏం సాధించింది తను.

ఏ డబ్బు విషయంలో గ్రాండ్‌పాకి ఆసరాగా ఈ దేశంలో వుండటానికి నిర్ణయించుకుందో తిరిగి గ్రాండ్‌పాని అదేస్థితికి నెట్టింది. . . ఒక చిన్న నిర్లక్ష్యం డిఫెన్స్ టెండర్ కోల్పోవటానికి కారణమైంది. . . ఇక్కడ సమస్య ఆర్థికమైన నష్టం కాదు - పోగొట్టుకున్న పరపతికి సంబంధించి మానసికంగా అయినగాయం.

ఆ అశాంతి నుంచి తను ఇంకా తేరుకోకముందే ఇప్పుడు జీవితను కోల్పోయింది - ఆమె మరణానికి ప్రత్యక్షంగా తను కారణం కాదు. కాని చేజేతులా తనే పంపించి మృత్యురూపంలోకి నెట్టింది.

"కృషి" డాక్టర్ మహంతి నిలబడి వున్నారు ద్వారం దగ్గర. కృషి అడక్కముందే చెప్పాడు "గ్రాండ్‌పాకి మళ్ళీ అటాక్ వచ్చిందేమో అని భయపడ్డానమ్మా . . .బాగా టెస్ట్ చేశాక తెలిసింది ఇది. . .